
మాట్లాడుతున్న బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో
నేటి నుంచి విజయసంకల్ప యాత్ర

బంజారాహిల్స్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఈనెల 26 నుంచి విజయసంకల్ప యాత్ర నిర్వహిస్తున్నామని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు తెలిపారు. నాగార్జుననగర్ కాలనీలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎర్రగడ్డ గోకుల్ థియేటర్ నుంచి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నేతృత్వంలో విజయసంకల్ప బస్సుయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ర్యాలీగా వెళ్లి మోతీనగర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి రాజీవ్‌నగర్ కూడలి, రహ్మత్‌నగర్ వద్ద మీటింగ్‌ని నిర్వహిస్తామని తెలిపారు. అక్కడి నుంచి యూసుఫ్‌గూడ, కృష్ణానగర్ మీదుగా వెళ్లి ఇందిరానగర్ వద్ద యాత్ర ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లంకల దీపక్‌రెడ్డి, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షురాలు కీర్తిరెడ్డి, విజయ సంకల్పయాత్ర ఇన్‌చార్జి ప్రేమ్‌కుమార్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కుంబాల గంగరాజు, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'హిందూ శ్మశానవాటికల అభివృద్ధి'

పంజాగుట్ట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12, 13లోని హిందూ శ్మశాన వాటికలసేవా సంఘం కార్యవర్గ సభ్యుల సమావేశం ఆదివారం చింతలబస్తీ పంచాయతీ కమిటీ కార్యాలయంలో జరిగింది. శ్మశానవాటికలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. తాజ్ బంజారా హోటల్ వారు అంతేగానికుంట చెరువును శుభ్రం చేస్తామని, శ్మశానవాటిక స్థలం లీజుకు తీసుకొని అభివృద్ధి చేయనందున లీజు రద్దు చేయాలని, శ్మశానవాటిక స్థలం కబ్జా కాకుండా పర్యవేక్షించాలని తీర్మానించారు. సమావేశంలో చింతలబస్తీ పంచాయతీ కమిటీ అధ్యక్షుడు వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అజయ్‌కృష్ణ, ప్రేమ్‌నగర్ పంచాయతీ కమిటీ అధ్యక్షుడు దాసరి విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి భగవాన్‌దాస్, కోశాధికారి జి. సుధీర్‌కుమార్, వీర్ నగర్ పంచాయతీ కమిటీ ప్రధాన కార్యదర్శి జి.మోహన్, శ్మశాన వాటికల సేవా సంఘం అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి విజయ్‌కృష్ణ, కోశాధికారి జీవా రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభను ప్రదర్శిస్తున్న చిన్నారులు

గ్రహణ మొర్రి పిల్లలకు ప్రత్యేక కార్యక్రమం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రహణ మొర్రితో బాధపడుతున్న చిన్నారుల ప్రతిభ వెలికి తీసి, వారిలో ఆత్మవిశ్వాసం పెంచడానికి బసవతారకం స్మైల్ ట్రైన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. డ్రీమ్స్ అన్ లిమిటెడ్ పేరుతో ఈ కార్యక్రమాన్ని ఆదివారం ఆస్పత్రి ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రెగ్యులేటరీ పోర్ట్ ఫోలియో, ప్రయారిటైజేషన్ డైరెక్టర్ అహజిత్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా ఆత్మన్యూనతతో బాధపడుతున్న పిల్లలు తమ భావాలను ధైర్యంగా వ్యక్తీకరించగలుగుతారన్నారు. శిక్షణ పొందిన పిల్లలు తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో స్మైల్ ట్రైన్ ఆసియా రీజనల్ డైరెక్టర్ మమత కరోల్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ ముకుందారెడ్డి, అర్చనా, సురేష్, డాక్టర్ బసంత్ కుమార్ రాయని, కేవీవీఎస్ రాజు, డాక్టర్ విభావరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ మోర్చా అధికార ప్రతినిధిగా కుమార్



బోరబండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా బోరబండ బ్రహ్మణవాడికి చెందిన వాంకడోత్ కుమార్ పరివార్‌ను నియమించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్ కుమార్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ.. పార్టీ పటిష్ఠతకు కృషిచేస్తానన్నారు.

ఉద్యోగ విరమణ వయస్సుకే.. మనస్సుకు కాదు


దీక్షితులు దంపతులను సన్మానిస్తున్న ఆలయ ఈవోలు, అర్చకులు

పంజాగుట్ట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ వయస్సుకేనని.. మనసుసకు కాదని ఆలయాల కార్యనిర్వాహక అధికారులు సత్యనారాయణ, సుధాకర్, కృష్ణగౌడ్ అన్నారు. వెంగళరావునగర్‌లో శ్రీరామంజనేయస్వామి ఆలయ ఆవరణలోని అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడు దిలీప్‌కుమార్ దీక్షితుల ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం ఆదివారం జరిగింది. దీక్షితుల దంపతులను ఆలయాల ఈవోలు, అర్చకులు సన్మానించారు. అమ్మవారి ఆలయ అర్చకుడిగా దిలీప్‌కుమార్ 30 సంవత్సరాలు సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల సంస్థ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ డీవీవీ వాణి, ఆలయ అర్చకుడు అంబాస్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆట, పాటలతో అలరించిన విద్యార్థులు

అమీర్‌పేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చిల్డ్రన్స్ డే ను పురస్కరించుకుని అమీర్‌పేట మారీగోల్డ్ హోటల్‌లో సన్‌సైన్ ప్రీస్కూల్ విద్యార్థులు ఆట, పాటలతో హోరెత్తించారు. ప్రధానంగా హిందీ, ఇంగ్లిష్, తెలుగు పాటలపై చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా సేవ్ వాటర్ స్కిట్ రైతు కష్టాలను, భూమిని కాపాడుకోవాల్సిన అవసరాన్ని ఎత్తి చూపింది. రామాయణ స్కిట్, ఫ్యాన్సీ షో, హెల్త్ బేబీ, పేరెంట్ అండ్ చైల్డ్ ర్యాంప్ వాక్, కలరింగ్, డ్రాయింగ్ వంటి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కో-ఫౌండర్, చైర్‌పర్సన్ సలోనివర్మ, ప్రత్యేక అతిథి డాక్టర్ షర్మిల తదితరులు పాల్గొన్నారు.


సీతారాముల వేషధారణలో విద్యార్థినులు


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి పీపీ రవిశేఖర్‌రెడ్డి
- బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

సంత్ శిరోమణి గురు రవిదాస్ జయంతిని
అధికారికంగా నిర్వహించాలి

పంజాగుట్ట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జగద్గురు సంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ జయంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సమగర(మోచి)కుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జగద్గురు సంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ 647వ జయంతి నిర్వహించారు. తెలంగాణ జన సమితి(టీజేఎస్)అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, మాజీ మంత్రులు మోత్కుపల్లి నర్సింహులు, టి.రాజయ్య, వివిధ సంఘాల ప్రతినిధులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేవుడి మందిరంలో కాదనీ, మనసులో ఉంటాడని, ఆయన్ను చేరుకోవడానికి ఎవరి అనుమతి లేదని చెప్పిన వ్యక్తి రవిదాస్ మహారాజ్ అని వక్తలు అన్నారు. ఆయన బోధనలను ఆచరించాలన్నారు. రవిదాస్ జయంతి రోజున సెలవు ప్రకటించాలని, రాష్ట్రంలో ఒక ప్రాజెక్ట్‌కు, జిల్లాకు ఆయన పేరు పెట్టాలని, రవిదాస్ పేరుతో ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయం నెలకొల్పాలని, కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు భరత్ భూషణ్, డా.సీహెచ్ రాజమౌళి, డాక్టర్ చీమ శ్రీనివాస్, వీరాస్వామి, బైరి వెంకటేశం మోచి తదితరులు పాల్గొన్నారు.



గురు రవిదాస్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, తదితరులు

వృద్ధుల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ అవసరం

- డాక్టర్ వసంత్‌కుమార్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వయోభారం, ఆరోగ్య సమస్యలతో వృద్ధులు సతమతమవుతుంటారని, వారి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని సీనియర్ జేరియాట్రిక్స్ నిపుణుడు డాక్టర్ వసంత్ కుమార్ అన్నారు. వృద్ధులు ఎదుర్కొనే సమస్యలను గుర్తించి, సరైన చికిత్స అందించే నిపుణుల అవసరం ఎంతో ఉందన్నారు. బంజారాహిల్స్‌లో ఉచ్ఛ్వాస్ ట్రాన్సిషన్ కేర్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వృద్ధులను కనిపెట్టుకొని అవసరానికి మందులు ఇవ్వడం, ఆలనాపాలనా చూసుకోవాలన్నారు. సీనియర్ సిటిజన్ల ఆరోగ్య సంరక్షణలో ప్రివెంటివ్ మెడిసిన్, జెరొంటాలజిస్టుల తోపాటు వారికి అన్ని రకాలుగా సేవలందించే సంస్థల ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. ముఖ్యంగా ఒంటరి వృద్ధుల సంరక్షణలో ఎల్డర్ ఎయిడ్ లాంటి సంస్థల అవసరం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ఉచ్ఛ్వాస్ ట్రాన్సిషనల్ కేర్ ప్రతినిధులు సతీష్, పవన్, ఎల్డర్ ఎయిడ్ ప్రతినిధి మందిరా జయసింహ తదితరులు పాల్గొన్నారు.


వృద్ధులతో డాక్టర్ వసంత్‌కుమార్

కులగణన తీర్మానాన్ని స్వాగతిస్తున్నాం

40 అంశాలపై సర్వే చేపట్టాలి : వక్తలు

పంజాగుట్ట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమగ్ర కులగణన జరపాలని అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని స్వాగతిస్తున్నామని వక్తలు అన్నారు. బిహార్ రాష్ట్రంలో 17 అంశాలపై సర్వే చేశారని, రాష్ట్రంలో 40 అంశాలపై సర్వే చేపట్టాలన్నారు. గత ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వే నివేదికను బయట పెట్టాలని వారు డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పేదలను మోసం చేశాయని ఆరోపించారు. ప్రజా తెలంగాణ ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కులగణన కార్యాచరణపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రొఫెసర్ కె.మురళీమనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఐఏఎస్ విశ్రాంత అధికారి ఆకునూరి మురళి, జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్లు ఎస్.సింహాద్రి, పీఎల్ విశ్వేశ్వర్ రావు, ఐ. తిరుమలి, జానయ్య తదితరులు మాట్లాడారు. కులగణనను వద్దనే వారు దేశద్రోహులు అన్నారు. బిహార్‌లో చేపట్టిన కులగణన తర్వాత అక్కడ రెండు లక్షల మందికి ఉద్యోగాలు లభించాయని, ఎంతోమందికి లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రంలో కులగణన వల్ల అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పృథ్వీరాజ్ యాదవ్, సాగరా బేగం, సతీష్, ప్రొఫెసర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐఏఎస్ విశ్రాంత అధికారి ఆకునూరి మురళి

మేయర్ బీఆర్ఎస్.. డిప్యూటీ మేయర్ కాంగ్రెస్..!

(5వ పేజీ తరువాయి)

పాలనాపరంగానూ బీఆర్ఎస్ మేయర్‌కు అధికారుల సహకారం పూర్తిస్థాయిలో అందకుండా ప్రభుత్వపరంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే ఇటీవల అధికారులు టార్గెట్‌గా పాలకమండలి సభ్యులు మండిపడ్డారు. డిప్యూటీ మునిసిపల్, జోనల్ కమిషనర్ల వైఖరిని ప్రస్తావిస్తూ పరోక్షంగా కమిషనర్ తీరునూ ఎండగట్టారు. ఇన్నాళ్లు కాంగ్రెస్ తరఫున కార్పొరేటర్లు మాత్రమే ఉండగా.. ఇప్పుడు డిప్యూటీ మేయర్ తోడయ్యారు. దీంతో సంస్థలో మరో అధికార కేంద్రం మొదలయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఇంతకుముందు నామ్ కే వాస్తే అన్నట్టుగా ఉన్న శ్రీలతారెడ్డి.. అధికార పార్టీలో చేరిన దృష్ట్యా.. ఇక సమీక్షలు, సమావేశాలు నిర్వహించవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో ప్రస్తుత బలాబలాలు

పార్టీ	సభ్యులు
బీఆర్ఎస్	52
ఎంఐఎం	42
బీజేపీ	40
కాంగ్రెస్	12
మొత్తం	147

(ఖాళీగా మూడు స్థానాలు)

అవిశ్వాసం పెట్టలేరు..

2020 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ 56 స్థానాల్లో గెలిచింది. బీజేపీ నుంచి ఆరుగురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ కార్పొరేటర్ ఒకరు గులాబీ పార్టీలో చేరారు. అయినా, ప్రస్తుతం కౌన్సిల్‌లో ఆ పార్టీ బలం 52కు తగ్గింది. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన 10 మంది కార్పొరేటర్లు హస్తం గూటికి చేరడమే ఇందుకు కారణం. కౌన్సిల్‌లో కాంగ్రెస్ బలం 12కు పెరిగింది. గులాబీ పార్టీకి చెందిన మరికొందరు కార్పొరేటర్లూ త్వరలో అధికార పార్టీ తీర్థం పుచ్చుకుంటారని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే మరో ఏడాది తర్వాత బీఆర్ఎస్ బలం ఎంతుంటుందన్నది చెప్పలేని పరిస్థితి. బీజేపీ సభ్యుల సంఖ్య 40, ఎంఐఎం సభ్యుల సంఖ్య 42గా ఉంది. బీజేపీకి చెందిన ఓ కార్పొరేటర్ మరణించగా.. ఎంఐఎం నుంచి ఇద్దరు కార్పొరేటర్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికవడంతో మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో పురపాలక శాఖ చట్టం ప్రకారం మూడేళ్ల అనంతరం అవిశ్వాసం పెట్టే అవకాశముంది. గతంలో దీనిని నాలుగేళ్లకు సవరిస్తూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు ప్రతిపాదన పంపింది. ఆమె ఫైల్‌ను వెనక్కి పంపడంతో చట్ట సవరణ జరగలేదు. గతంలో గవర్నర్ ఆమోదించిన పక్షంలో ప్రస్తుతం మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో అవిశ్వాసానికి అవకాశం ఉండేది కాదు.

నిలిచి ఉన్న ట్యాంకర్‌ను ఢీకొట్టిన కారు

- ఓ వ్యక్తి మృతి, నలుగురికి గాయాలు
- నల్లగొండ జిల్లా కట్టంగూరులో ఘటన

కట్టంగూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కట్టంగూరు మండల పరిధిలో 65వ నెంబరు జాతీయ రహదారిపై నిలిచి ఉన్న ట్యాంకర్‌ను కారు ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. నలుగురు గాయపడ్డారు. కట్టంగూరు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్(ఎల్బీనగర్) అలకాపురి కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న గోవింద్ బాలయ్య(50) కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం తెల్లవారుజామున కారులో సూర్యాపేట జిల్లా, కోదాడ మండలం, ఎర్రవరం లక్ష్మీ నృసింహస్వామి దర్శనానికి బయలుదేరారు. తమ్ముడి కుమార్తె అనారోగ్యంగా ఉండటంతో దేవాలయానికి వెళ్తున్నారు. ఇందుకోసం అపార్ట్‌మెంట్‌కు చెందిన ఓ వ్యక్తికి చెందిన కారుకు బాలయ్య ఇద్దరు కుమారుల్లో పెద్దవాడైన, డ్రైవర్‌గా పనిచేస్తున్న లింగస్వామి వచ్చాడు. బాలయ్య ముందు సీట్లో కూర్చోగా, లింగస్వామి వాహనం నడుపుతున్నాడు. బాలయ్య తమ్ముడు కుమార్తె చందన, లింగస్వామి కుమారుడు నమీష్, కుమార్తె అంకృత వెనుక కూర్చున్నారు.

కట్టంగూరు మండలం ఎర్రసానిగూడెం వద్ద అతివేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి రహదారి ఎడమవైపు దూసుకెళ్లింది. ఈ క్రమంలో హైవే పక్కన వాహనాల విశ్రాంతి ప్రదేశంలో నిలిపి ఉన్న ట్యాంకర్‌ను వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జవగా బాలయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. వాహనం నడుపుతున్న లింగస్వామితో పాటు ఆయన కుమారుడు నమీష్, కుమార్తె అంకృత, ఆయన బాబాయ్ కుమార్తె చందనకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను నార్కట్‌పల్లి సమీపంలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. బాలయ్య మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలయ్య భార్య, కోడలు ఇంటివద్దే ఉండడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ట్యాంకర్ కిందకు దూసుకెళ్లిన కారు

హజ్ యాత్రకు 7,811 మంది ఎంపిక

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- తొలి అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహణ

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రకు రాష్ట్రం నుంచి 7,811 మంది హాజీలు వెళ్లనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ తెలిపారు. హజ్‌యాత్రకు వెళ్లేందుకు ఈసారి 11,313 మంది దరఖాస్తు చేసుకున్నారని, హజ్ కమిటీ కోటాలో 7,811 మంది ఎంపికయ్యారని ఆయన చెప్పారు. ఆదివారం ఓల్డ్‌మలక్‌పేటలో తెలంగాణ హజ్ కమిటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రికుల కోసం నిర్వహించిన మొదటి అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని షబ్బీర్ అలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపికైన వారి కోసం సౌదీ అరేబియాలోని మక్కాలో రాష్ట్ర ప్రభుత్వం హజ్ కమిటీ ద్వారా భోజనం, ఉండేందుకు వసతులు కల్పిస్తుందన్నారు. 7,811 మంది హాజీల్లో హైదరాబాద్‌కు చెందిన వారు 4వేల మందిపైగా ఉన్నారని తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ సయ్యద్ అజ్మత్ ఉల్లా హుస్సెనీ తెలిపారు. మొదటి విడతగా రూ.80,800 చెల్లించాల్సి ఉండగా ఎంపికైన 1,316 మంది చెల్లించకపోవడంతో వెయిటింగ్ లిస్ట్‌లో పెట్టామని, రెండో విడతగా రూ.1.70లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ రెండు వాయిదాలు కలిపి మార్చి 10న రాష్ట్ర హజ్ కమిటీకి చెల్లించాలని తెలిపారు. సౌదీ ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చాక మూడో విడత చెల్లింపులు చేయాల్సి ఉంటుందన్నారు. ఒక్కో హజ్ యాత్రికుడికి రూ.3.50లక్షల వరకు ఖర్చవుతుందని సూచనప్రాయంగా తెలిపారు. వచ్చే మే 9 నుంచి హైదరాబాద్ నుంచి హజ్ యాత్రకు బయల్దేరుతారన్నారు. వీరికోసం రాష్ట్రవ్యాప్తంగా 20 అవగాహన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బలాల, టీపీసీసీ కార్యదర్శి మక్సూద్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

పార్కు ఎదుట వ్యాపార కార్యకలాపాలు



పార్కు వద్ద ఏర్పాటు చేసిన స్టాల్ నిర్వాహకుడిని ప్రశ్నిస్తున్న వాకర్లు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కేబీఆర్ పార్కు ఎదుట రెండు, మూడు రోజుల నుంచి కొంతమంది వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ప్రధాన గేటు ఎదుట స్టాల్ ఏర్పాటు చేసి అమ్మకాలు చేస్తుండడం పలువురు వాకర్లు ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కు అధికారుల అనుమతి ఉందని వ్యాపారి అనడంతో వాకర్స్ అసోసియేషన్, పార్కు అధికారులకు వాకర్లు ఫిర్యాదు చేశారు.

జలమండలి ఇంజనీర్స్ అసోసియేషన్
అధ్యక్షుడిగా రాజశేఖర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జలమండలి ఇంజనీర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్షుడిగా ఎస్. రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డి. శ్రీనివాస్‌రెడ్డి, పి. మహేశ్వరరావు, జి. ఇందిరా శీలారాణి, జనరల్ సెక్రటరీగా వి. వినోద్ భార్గవ, జాయింట్ సెక్రటరీగా ఎస్. కళ్యాణి, మహ్మద్ అఫ్రీద్, వి. చంద్ర ప్రకాశ్‌రెడ్డి, మహిళా జాయింట్ సెక్రటరీగా సీహెచ్. ప్రశాంతి, ట్రెజరర్‌గా సంతోష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శరత్‌కుమార్‌రెడ్డి, ఈసీ మెంబర్‌గా కె. నవీన్, గౌరీదేవి స్వామి, కె. సూర్యప్రకాశ్‌రావు, ఎస్. నరేష్ ఎన్నికైనట్లు అసోషియేషన్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.

చంపేస్తామంటూ మహిళకు బెదిరింపు

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చంపేస్తామంటూ ఓ మహిళను బెదిరించారు ముగ్గురు వ్యక్తులు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడలో నివసిస్తున్న చల్లా పవనకుమారి తనకు పరిచయం ఉన్న చల్లా వనజ, నిడదవోలు పార్వతి అనే మహిళలతో కలిసి 2019లో కళ్యాణ్‌నగర్‌లో లెగస్సీ హ్యాండ్లూమ్ పేరుతో గార్మెంట్ షాపు ప్రారంభించారు. ఈ నెల 24వ తేదీన బోర్డు మీటింగ్ ఉందని వనజ, పార్వతి 23వ తేదీన మెసేజ్ పంపారు. పవనకుమారి వెళ్లి కూర్చోగానే వారిద్దరూ బయటకు వెళ్లారు. పావుగంట అయినా రాలేదు. మీటింగ్ ఎజెండా ఏమిటని పవనకుమారి అడిగినా వారు పట్టించుకోలేదు. దీంతో చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ నరేందర్‌రెడ్డికి కబురు పంపగా ఆయన వచ్చారు. అతడిని విషయం అడగగా ముగ్గురూ కలిసి పవనకుమారిని దుర్భాషలాడారు. 'నీ భర్తకు అన్నీ తెలుసని, ఆయన సమావేశానికి ఎందుకు రాలేదని, నీకు బిజినెస్ ఎందుకు' అని ప్రశ్నించారు. ఆమె వెంటనే భర్త చల్లా సత్యవరప్రసాద్‌కు ఫోన్ చేసింది. ఆయన సమావేశం నుంచి బయటకు వచ్చేయమని భార్యకు చెప్పాడు. పవనకుమారి బయటకు వెళ్లడానికి ప్రయత్నించగా ముగ్గురూ కలిసి అడ్డుకొని చంపేస్తామని బెదిరించి తోసేశారు. ఆమె డ్రైవర్ సీహెచ్ నరేందర్ లోపలకు వెళ్లి పవనకుమారిని రక్షించి బయటకు తీసుకొచ్చాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

అమీర్‌పేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. విజయనగరం జిల్లాకు చెందిన జీవన్ కిశోర్ ఉద్యోగం నిమిత్తం 10 రోజుల క్రితం నగరానికి వచ్చి అమీర్‌పేట షైహోమ్స్ అపార్ట్‌మెంట్‌లో మిత్రులతో కలిసి ఉంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం రూమ్‌లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. బయటకు వెళ్లిన రూమ్‌మేట్స్ గది వద్దకు వచ్చారు. తలుపు వేసి ఉండడంతో పిలిచినా కిశోర్ స్పందించలేదు. అనుమానంతో ఎస్ఆర్‌నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా కిశోర్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. రూమ్‌మేట్స్ తెలిపిన వివరాల ప్రకారం ప్రేమ విఫలమవడం వల్లే జీవన్ కిశోర్ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

తల్లీకూతుళ్లతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తల్లీకూతుళ్లతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ మహిళ రహ్మత్‌నగర్‌లో కుమార్తెతో కలిసి నివసిస్తోంది. వారి ఇంటి పక్కనే ఉంటున్న ఓ వ్యక్తి తల్లీకూతుళ్లపట్ల కొంతకాలంగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో బాధితులు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 23న కూడా మహిళ కుమార్తెపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు.

మెట్రోలో చోరీ

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మెట్రోలో చోరీ జరిగింది. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన అభిషేక్ అభిదత్తా ఈనెల 13న ఎర్రమంజిల్ నుంచి అమీర్‌పేటకు మెట్రో రైలులో ప్రయాణించాడు. అమీర్‌పేటలో దిగి పర్సు చూసుకోగా కనిపించలేదు. దీంతో పోలీసులకు అదేరోజు ఫిర్యాదు చేశాడు. పర్సులో రూ. 1,200, రూ. 50 వేల విలువగల గోల్డ్‌చైన్ ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసును మధురానగర్ పీఎస్‌కు ఆదివారం బదిలీ చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఖైరతాబాద్ ఏఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 7 గంటల సమయంలో ఓ వ్యక్తి ఖైరతాబాద్ రైల్వే గేటు సమీపంలో అపస్మారకస్థితిలో పడిఉన్నాడు. స్థానికుల సమాచారంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా చనిపోయి ఉన్నాడు. మృతుడి శరీరంపై లైట్ నీలిరంగు షర్ట్, నల్లటి రంగు, తెల్లటి లైన్‌లుగల ప్యాంటు ఉన్నాయని తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో లేదా 8712571332 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఏఎస్ఐ సురేందర్‌ను సంప్రదించాలని సూచించారు.

నానక్‌రాంగూడలో భారీ అగ్నిప్రమాదం

రాయదుర్గం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నానక్‌రాంగూడ ప్రధాన రహదారిలో ఎస్‌బీఐ ఎదురుగా రోడ్డు పక్కన ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో పెద్ద అగ్నిప్రమాదం జరిగింది. సుమారు ఐదుమీటర్ల ఎత్తు వరకు మంటలు ఎగసిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే గచ్చిబౌలి పోలీసులకు, మాదాపూర్ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దీంతో ముప్పు తప్పింది. అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే రోడ్డుపక్కన భూగర్భ గ్యాస్‌పైపులైన్ పైన కొంతకాలంగా చుట్టుపక్కల ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారులు చెత్తవేశారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఆ చెత్తకు నిప్పంటించడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు అంటున్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై విచారిస్తామని ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ఎగసిపడుతున్న మంటలు



మహార్దశ!

- అమృత్ భారత్ కింద వికారాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్ల ఎంపిక
- వికారాబాద్ రైల్వే స్టేషన్‌ను రూ.24.35 కోట్లు, రూ.15 కోట్లతో మేడ్చల్ రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ
- ఎయిర్‌పోర్టును తలపించే విధంగా అభివృద్ధి
- అమృత్ భారత్ స్టేషన్లకు నేడు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన

మేడ్చల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఎంపికైన రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులకు నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం (ఏబీఎస్ఎస్) కింద ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో రూ.76.31 కోట్లతో వికారాబాద్, ఉందానగర్, షాద్‌నగర్ మేడ్చల్, మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్లను ఆధునీకరించేందుకు ఎంపిక చేశారు. వికారాబాద్ రైల్వే స్టేషన్‌ను రూ.24.35 కోట్లు, ఉందానగర్ రూ.12.37 కోట్లు, షాద్‌నగర్ రైల్వేస్టేషన్‌ను రూ.9.59 కోట్లు, మేడ్చల్ రూ.15 కోట్లు, మల్కాజ్‌గిరి రైల్వేస్టేషన్‌ను రూ.15 కోట్లతో ఆధునీకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. సోమవారం న్యూఢిల్లీ నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా అమృత్ భారత్ స్టేషన్ల కింద ఆయా రైల్వేస్టేషన్లలో చేపట్టనున్న ఆధునీకరణ పనులకు భూమిపూజ, శంకుస్థాపనలు చేయనున్నారు.

మేడ్చల్ ప్రజలకు మరో కానుక

కాగా, మేడ్చల్ ప్రజలకు రైల్వేశాఖ మరో కానుక ఇచ్చింది. అమృత్ భారత్ కింద జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి రైల్వేస్టేషన్ ఎంపిక య్యాయి. ఈ పథకం కింద ఆయా రైల్వే స్టేషన్లను ఆధునికీకరించనున్నారు. ఏయిర్‌పోర్టును తలపించే విధంగా అన్ని హంగులతో మేడ్చల్ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి పరచనున్నారు. ఇప్పటికే మేడ్చల్ ప్రాంతం ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించటానికి మేడ్చల్-సికింద్రాబాద్ రైల్వేలైన్‌ను విద్యుద్దీకరణ చేసి ఎంఎంటీఎస్ రైలును ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా ప్రస్తుతం స్థానిక స్టేషన్‌ను అన్ని హంగులతో మోడల్ రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు అమృత్‌స్టేషన్ కింద ఎంపిక చేశారు. హైదరాబాద్ డివిజన్‌లో మొత్తం 17రైల్వే స్టేషన్లు అమృత్ భారత్ కింద ఎంపిక చేసినట్లు రైల్వేశాఖ అధికారులు తెలిపారు. వీటిలో మల్కాజిగిరి, మేడ్చల్, షాద్‌నగర్, కామారెడ్డి తదితర స్టేషన్లు ఉన్నాయి. అయితే మేడ్చల్ జిల్లాకు చెందిన రెండు రైల్వే స్టేషన్ల అభివృద్ధికి దాదాపు రూ.30కోట్ల వరకు ఖర్చు చేయనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ప్రణాళికను రూపొందిస్తున్నారు. ఇప్పటికే స్టేషన్‌లో చేపట్టాల్సిన పనులపై రైల్వే శాఖ ఉన్నత అధికారులు సమీక్షిస్తున్నారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు స్టేషన్‌లో చేపడుతున్న పనుల గురించి పరిశీలిస్తున్నారు.

అమృత్ భారత్ కింద చేపట్టే పనులు ఇవే...

అమృత్ భారత్ కింద రైల్వేస్టేషన్‌ను అధునాతనంగా అభివృద్ధి పర్చడంలో భాగంగా అనేక మార్పులు, చేర్పులు చేయనున్నారు. ప్రస్తుతం స్టేషన్‌కు రెండు వైపుల ఉన్న ప్లాట్‌ఫామ్‌లను పూర్తిగా ఆధునికీకరించనున్నారు. రెండు ప్లాట్‌ఫాంలపై ప్రయాణికుల సౌకర్యార్థం విద్యుత్‌తో



నడిచే ఎస్కలేటర్లను ఏర్పాటు చేయడం జరుగుతుంది. రెండువైపుల ప్రత్యేక టికెట్ కౌంటర్లను, వాహనాల పార్కింగ్, క్యాంటీన్, ప్రయాణికులకు విశ్రాంతి గదులు, మహిళలకు, పురుషులకు ప్రత్యేకంగా టాయిలెట్లు ఏర్పాటు చేయనున్నారు. రిజర్వేషన్ కౌంటర్లు, ప్రయాణికులకు కుర్చీలు, వినోదానికి సంబంధించిన పరికరాలు ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు వాహనాలు, ఆర్టీసీ బస్సులు నేరుగా స్టేషన్‌కు చేరుకునే విధంగా పనులు చేపడుతున్నారు. విమానాశ్రయాన్ని తలపించే విధంగా స్టేషన్ ఆధునీకరణ ఉంటుందని అధికారులు తెలిపారు. మోడల్ రైల్వే స్టేషన్‌లో సకల సౌకర్యాలతో పాటు ప్రత్యేకంగా ఇక్కడి నుంచి కొన్ని రైళ్లను ప్రారంభించేందుకు వీలుంది. దీనికి తోడు కొన్ని సూపర్ ఫాస్ట్ రైళ్ల ఆగే వీలు కల్పిస్తున్నారు. వీటితో పాటు రైల్వే స్టేషన్ పరిసరాల సుందరీకరణకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నారు.

గుండ్లపోచంపల్లి, గౌడవెల్లి ఆర్‌యూబీ పనులకు శంకుస్థాపన

గుండ్లపోచంపల్లి, గౌడవెల్లి రైల్వేగేట్ల వద్ద నిర్మించే ఆర్‌యూబీ పనులకు నేడు ప్రధాన మంత్రి మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే అధికారులు ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధానమంత్రి మోదీ కార్యక్రమాన్ని వీక్షించే విధంగా ఏర్పాట్లు చేశారు.


శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు, ప్రజలు

ఎమ్మెల్యే లాస్యనందితకు శ్రద్ధాంజలి

తిరుమలగిరి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో బొల్లారం రిసాలబజార్‌లో డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఆమె పవిత్ర ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని కోరుకున్నారు. చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్, వార్డ్-8 బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రవికుమార్, బాలరాజు, సుధాకర్, డాక్టర్ శంకర్ రావు, విజయ్ కుమార్, కరుణాకర్ రెడ్డి, హేమంత్, అశోక్, అనిల్ పాల్గొన్నారు.

మెట్రోలో నగదు, నగలు చోరీ

యుసుఫ్‌గూడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మెట్రోలో నగలు, నగదు చోరీ అయ్యాయి. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన అభిషేక్ అభిదత్తా ఈనెల 13న ఎర్రమంజిల్ నుంచి అమీర్‌పేటకు మెట్రో రైలులో ప్రయాణించాడు. అమీర్‌పేటలో దిగి పర్సు చూసుకోగా కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పర్సులో రూ.1,200, రూ.50 వేల విలువగల గోల్డ్‌చైన్ ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి మధురానగర్ పీఎస్‌కు బదిలీ చేశారు.


సికింద్రాబాద్ జిల్లా సాధన సమితి బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న గుర్రం పవన్‌కుమార్‌గౌడ్

సికింద్రాబాద్ జిల్లా సాధనే ధ్యేయం

- జిల్లా సాధన సమితి అధ్యక్షుడు పవన్ కుమార్‌గౌడ్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా సుపరిచితమైన సికింద్రాబాద్ పేరిట జిల్లాను సాధించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని సికింద్రాబాద్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. సికింద్రాబాద్ మధురానగర్ కాలనీలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ జిల్లా సాధన కోసం అన్ని రాజకీయ పార్టీలను, కార్మిక సంఘాలను, కుల సంఘాలను, అన్ని వర్గాల ప్రజలను, నేతలను ఒక్కతాటిపైకి తీసుకువస్తామని వెల్లడించారు. విద్య, వైద్య, వ్యాపార, వాణిజ్య సంగీత, సాహితీ, సాంస్కృతిక, రైల్వే, రక్షణ తదితర రంగాల్లో ప్రత్యేకత కలిగి ఉన్న సికింద్రాబాద్‌ను జిల్లాగా ప్రకటించాలన్న లక్షలాది మంది ప్రజల ఆకాంక్షను నెరవేర్చడానికి తాము చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని పవన్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ జిల్లా సాధనకు అందరినీ ఏకం చేసే చర్యలను తాము ముమ్మరం చేశామని చెప్పారు. సికింద్రాబాద్ నుంచి వివిధ హోదాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులను, ఉన్నతాధికారులను కలవనున్నట్టు వెల్లడించారు. సికింద్రాబాద్ జిల్లా సాధన సమితి లెటర్ హెడ్, బ్రోచర్ తదితర సామాగ్రిని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. సాధన సమితి ప్రధాన కార్యదర్శి బాలరాజ్‌యాదవ్, ఉపాధ్యక్షులు మిట్టపల్లి బాబూరావు, శైలేందర్, కోశాధికారి అబ్దుల్ అజీజ్, కార్యవర్గ సభ్యుడు రవీందర్‌సాగర్, కృష్ణముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రహణ మొర్రి పిల్లలకు ప్రత్యేక కార్యక్రమం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రహణ మొర్రితో బాధపడుతున్న చిన్నారుల ప్రతిభ వెలికి తీసి, వారిలో ఆత్మ విశ్వాసం పెంచడానికి బసవతారకం స్మైల్ ట్రైన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. డ్రీమ్స్ అన్ లిమిటెడ్ పేరుతో ఈ కార్యక్రమాన్ని ఆదివారం ఆస్పత్రి ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రెగ్యులేటరీ పోర్ట్ ఫోలియో, ప్రయారిటైజెషన్ డైరెక్టర్ అహిజిత్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా ఆత్మన్యూనతతో బాధపడుతున్న పిల్లలు తమ భావాలను ధైర్యంగా వ్యక్తీకరించగలుగుతారన్నారు. శిక్షణ పొందిన పిల్లలు తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో స్మైల్ ట్రైన్ ఆసియా రీజనల్ డైరెక్టర్ మమత కరోల్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ ముకుందరెడ్డి, అర్చనా, సురేష్, డాక్టర్ బసంత్ కుమార్ రాయని, కేవీవీఎస్ రాజు, డాక్టర్ విభావరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలలో ప్రత్యేక పూజలు


అన్నదానం చేస్తున్న జీహెచ్‌ఎమ్‌సీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ డాక్టర్ నరసింహన్


మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న పద్మశాలి సంఘం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్, దేవాలయ కమిటీ సభ్యులు

తిరుమలగిరి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్‌బజార్‌లోని భూలక్ష్మమ్మ దేవాలయంలో జీహెచ్ఎమ్‌సీ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నరసింహన్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌లు పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని అమ్మ వారికి అర్చన, అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం అన్నదానం చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పూర్ణచందర్, రాజు, రాజేష్, జయంతి, ఉదయని, ఉమా, పద్మ, లత, తులసి, ప్రగతి, శివాని, కార్తికలు పాల్గొన్నారు.

మార్కండేయ ఆలయంలో

అడ్డగుట్ట : అడ్డగుట్టలో మార్కండేయ ఆలయంలో మూడో రోజు ఉదయం ఐదు గంటలకు సుప్రభాత సేవ, ఉపనిషత్ పారాయణం ఆవాహిత దేవతా హోమం, శ్రీగణపతి రుద్రచండి హోమాలు, వేదపండితులైన రఘు స్వామి, గోపూజ, గణపతి ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్, కల్లెపల్లి రాజు, దేవాలయ కమిటీతో పాటు పద్మశాలి సంఘం అడ్డగుట్ట డివిజన్ ప్రధాన కార్యదర్శి అడెపు శ్రీరాములు, కోశాధికారి తమ్మల శంకర్‌లు పాల్గొన్నారు.

ఆసక్తి ఉన్న రంగాల్లో పిల్లలను ప్రోత్సహించాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు చిన్నతనం నుంచే వారికి ఆసక్తి ఉన్న రంగాలలో ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈనెల 16వ తేదీన కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో మెడల్స్ సాధించిన జెక్ కాలనీకి చెందిన చిన్నారులతో ఆదివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని నివాసంలో కోచ్‌లు దేవేందర్, సిరి ఎలిజబెత్‌లు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. గోల్డ్ మెడల్ సాధించిన గుంటూరు మోక్షిక, రిత్విక్, సిల్వర్ మెడల్ సాధించిన


కరాటే క్రీడల్లో మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మోక్షిత్, కార్తిక్, లియోనా, శ్రీయాన్ ఇతర మెడల్స్ సాధించిన చిన్నారులను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అభినందించారు. శిక్షణ ఇచ్చి మెడల్స్ సాధించే విధంగా కృషి చేసిన కోచ్‌లను ఆయన అభినందించారు.

రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలో..

రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని సిటీలైట్ చౌరస్తాలో గల గౌస్ ఏ పాక్ దర్గాలో ఆదివారం నిర్వహించిన గార్వి షరీఫ్ ఫాతియా కార్యక్రమంలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, నిర్వాహకులు ఫకీర్, జాకీర్, అమిత్, అలీ, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ప్రేమ్‌కుమార్, వినయ్‌కుమార్, గౌరీశంకర్, సత్యనారాయణ, శివకుమార్, తాండ్రరాజు పాల్గొన్నారు.

నిలిచి ఉన్న ట్యాంకర్‌ను ఢీకొన్న కారు

- అక్కడికక్కడే వ్యక్తి మృతి, నలుగురికి గాయాలు
- నల్లగొండ జిల్లా కట్టంగూరులో ఘటన

కట్టంగూరు, ఫిబ్రవరి 25 : నల్లగొండ జిల్లా కట్టంగూరు మండల పరిధిలోని 65వ నెంబరు జాతీయ రహదారిపై నిలిచి ఉన్న ట్యాంకర్‌ను అతివేగంతో కారు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన కట్టంగూరు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ (ఎల్‌బీనగర్) అలకాపురి కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న గోవింద్ బాలయ్య(50) కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం తెల్లవారుజామున ఏపీ28డీఎన్ 9972 కారులో సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ఎర్రవరం లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి బయలుదేరారు. తమ్ముడి కుమార్తె అనారోగ్యంగా ఉండటంతో దేవాలయానికి వెళ్తున్నారు. ఇందుకోసం అపార్ట్‌మెంట్‌కు చెందిన ఓ వ్యక్తికి చెందిన కారుకు బాలయ్య ఇద్దరు కుమారుల్లో పెద్దవాడైన, డ్రైవర్‌గా పనిచేస్తున్న లింగస్వామి వెంటవచ్చాడు. బాలయ్య ముందు సీట్లో కూర్చోగా, లింగస్వామి వాహనం నడుపుతున్నాడు. బాలయ్య తమ్ముడు కుమార్తె చందన, లింగస్వామి కుమారుడు నమీష్, కుమార్తె అంకృతలు వెనుక కూర్చున్నారు. కట్టంగూరు మండలం ఎర్రసానిగూడెం వద్ద అతివేగంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో రహదారికి ఎడమవైపు దూసుకెళ్లింది. ఈ క్రమంలో హైవే పక్కన వాహనాల విశ్రాంతి ప్రదేశంలో నిలిపి ఉన్న ట్యాంకర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జయి బాలయ్య అక్కడికక్కడే మృతిచెందగా, వాహనం నడుపుతున్న లింగస్వామితో పాటు ఆయన కుమారుడు నమీష్, కుమార్తె అంకృత, ఆయన బాబాయ్ కుమార్తె చందనలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను నార్కట్‌పల్లి సమీపంలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. బాలయ్య మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. బాలయ్య భార్య, కోడలు ఇంటి వద్దనే ఉండటంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు.


నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలో జాతీయ రహదారిపై ట్యాంకర్ కిందికి దూసుకెళ్లిన కారు


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాలయ్య


ప్రమాదంలో గాయపడిన చందన, నమీష్, అంకృత


నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చందన, నమీష్


ప్రమాదంలో గాయపడిన గోవింద్ లింగస్వామి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాలయ్య(ఫైల్)



ఆల్ ఇన్ మలయాళీ అసోసియేషన్ చైర్మన్‌గా సురేంద్రన్

ఆల్ ఇన్ మలయాళీ నూతన కమిటీ

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇన్ మలయాళీ అసోసియేషన్ తెలంగాణ చైర్మన్‌గా కన్నాట్ సురేంద్రన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చైర్మన్‌గా కన్నాట్ సురేంద్రన్‌తో పాటు నూతన అధ్యక్షునిగా బాబు ఉన్నినీ, ఉపాధ్యక్షుడిగా టీపీ మాథ్యూ, ప్రధాన కార్యదర్శిగా జి.సురేష్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా పి.సంతోష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సేథు మాధవన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా పి.విశ్వనాధన్, కే.ఆర్.శశిధరణ్, ఎం.ఎస్.రాజేష్‌కుమార్, జి.వేణుగోపాల్, కె.వి.శణ్ముఖన్‌లను మహిళా విభాగం నుంచి టీ.ఎస్.వల్సాలా, బీ.జీ.మాథ్యూ సరిత సునిల్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా ఎన్నికయిన కన్నాట్ సురేంద్రన్ మాట్లాడుతూ.. కొద్ది సంవత్సరాలుగా తమ అసోసియేషన్ తెలంగణాలోని మలయాళీలతోపాటు పేదవర్గాల ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అలాగే రాబోయే రోజుల్లో వివిధ అంశాల్లో ఇబ్బందులు పడుతున్న పేదవారి కోసం తమ అసోసియేషన్ పూర్తిగా సహాయ సహకారాలు అందించి ఆదుకుంటుందన్నారు.

మేయర్ బీఆర్ఎస్..
డిప్యూటీ మేయర్ కాంగ్రెస్..!

(5వ పేజీ తరువాయి)

పాలనాపరంగానూ బీఆర్ఎస్ మేయర్‌కు అధికారుల సహకారం పూర్తిస్థాయిలో అందకుండా ప్రభుత్వపరంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే ఇటీవల అధికారులు టార్గెట్‌గా పాలకమండలి సభ్యులు మండిపడ్డారు. డిప్యూటీ మునిసిపల్, జోనల్ కమిషనర్ల వైఖరిని ప్రస్తావిస్తూ పరోక్షంగా కమిషనర్ తీరునూ ఎండగట్టారు. ఇన్నాళ్లు కాంగ్రెస్ తరఫున కార్పొరేటర్లు మాత్రమే ఉండగా.. ఇప్పుడు డిప్యూటీ మేయర్ తోడయ్యారు. దీంతో సంస్థలో మరో అధికార కేంద్రం మొదలయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఇంతకుముందు నామ్ కే వాస్తే అన్నట్టుగా ఉన్న శ్రీలతారెడ్డి.. అధికార పార్టీలో చేరిన దృష్ట్యా.. ఇక సమీక్షలు, సమావేశాలు నిర్వహించవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అవిశ్వాసం పెట్టలేరు..

2020 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ 56 స్థానాల్లో గెలిచింది. బీజేపీ నుంచి ఆరుగురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ కార్పొరేటర్ ఒకరు గులాబీ పార్టీలో చేరారు. అయినా, ప్రస్తుతం కౌన్సిల్‌లో ఆ పార్టీ బలం 52కు తగ్గింది. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన 10 మంది కార్పొరేటర్లు హస్తం గూటికి చేరడమే ఇందుకు కారణం. కౌన్సిల్‌లో కాంగ్రెస్ బలం 12కు పెరిగింది. గులాబీ పార్టీకి చెందిన మరి కొందరు కార్పొరేటర్లూ త్వరలో అధికార పార్టీ తీర్థం పుచ్చుకుంటారని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే మరో ఏడాది తర్వాత బీఆర్ఎస్ బలం ఎంతుంటుందన్నది చెప్పలేని పరిస్థితి. బీజేపీ సభ్యుల సంఖ్య 40, ఎంఐఎం సభ్యుల సంఖ్య 42గా ఉంది. బీజేపీకి చెందిన ఓ కార్పొరేటర్ మరణించగా.. ఎంఐఎం నుంచి ఇద్దరు కార్పొరేటర్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికవడంతో మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలోని మునిసిపాల్టీలు, కార్పొరేషన్లలో పురపాలక శాఖ చట్టం ప్రకారం మూడేళ్ల అనంతరం అవిశ్వాసం పెట్టే అవకాశముంది. గతంలో దీనిని నాలుగేళ్లకు సవరిస్తూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు ప్రతిపాదన పంపింది. ఆమె ఫైల్‌ను వెనక్కి పంపడంతో చట్ట సవరణ జరగలేదు. గతంలో గవర్నర్ ఆమోదించిన పక్షంలో ప్రస్తుతం మునిసిపాల్టీలు, కార్పొరేషన్లలో అవిశ్వాసానికి అవకాశం ఉండేది కాదు.

జీహెచ్‌ఎంసీ కౌన్సిల్‌లో ప్రస్తుత బలాబలాలు

పార్టీ	సభ్యులు
బీఆర్ఎస్	52
ఎంఐఎం	42
బీజేపీ	40
కాంగ్రెస్	12
మొత్తం	147

(ఖాళీగా మూడు స్థానాలు)


పార్కు వద్ద ఏర్పాటు చేసిన స్టాల్ నిర్వాహకుడిని ప్రశ్నిస్తున్న వాకర్లు

పార్కు ఎదుట వ్యాపార కార్యకలాపాలు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కేబీఆర్ పార్కు ఎదుట రెండు, మూడు రోజుల నుంచి కొంతమంది వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ప్రధాన గేటు ఎదుట స్టాల్ ఏర్పాటు చేసి అమ్మకాలు చేస్తుండడంతో పలువురు వాకర్లు ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కు అధికారుల అనుమతి ఉందని వ్యాపారి అనడంతో వాకర్స్ అసోసియేషన్, పార్కు అధికారులకు వాకర్లు ఫిర్యాదు చేశారు.

హజ్ యాత్రకు 7,811 మంది ఎంపిక

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- తొలి అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహణ

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రకు రాష్ట్రం నుంచి 7,811 మంది హాజీలు వెళ్లనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ తెలిపారు. హజ్‌యాత్రకు వెళ్లేందుకు ఈసారి 11,313 మంది దరఖాస్తు చేసుకున్నారని, హజ్ కమిటీ కోటాలో 7,811 మంది ఎంపికయ్యారని ఆయన చెప్పారు. ఆదివారం ఓల్డ్ మలక్‌పేటలో తెలంగాణ హజ్ కమిటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రికుల కోసం నిర్వహించిన మొదటి అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని షబ్బీర్ అలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన వారి కోసం


సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

సౌదీ అరేబియాలోని మక్కాలో రాష్ట్ర ప్రభుత్వం హజ్ కమిటీ ద్వారా భోజనం, ఉండేందుకు వసతులు కల్పిస్తుందన్నారు. 7,811 మంది హాజీల్లో హైదరాబాద్‌కు చెందిన వారు 4వేల మందిపైగా ఉన్నారని తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ సయ్యద్ అజ్మత్ ఉల్లా హుసెనీ తెలిపారు. మొదటి విడతగా రూ.80,800 చెల్లించాల్సి ఉండగా ఎంపికైన 1,316 మంది చెల్లించకపోవడంతో వెయిటింగ్ లిస్ట్‌లో పెట్టామని, రెండో విడతగా రూ.1.70లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ రెండు వాయిదాలు కలిపి మార్చి 10న రాష్ట్ర హజ్ కమిటీకి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

సౌదీ ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చాక మూడో విడత చెల్లింపులు చేయాల్సి ఉంటుందన్నారు. ఒక్కో హజ్ యాత్రికునికి రూ.3.50లక్షల వరకు ఖర్చవుతుందని సూచనప్రాయంగా తెలిపారు. వచ్చే మే 9 నుంచి హైదరాబాద్ నుంచి హజ్ యాత్రకు బయల్దేరుతారన్నారు. వీరికోసం రాష్ట్రవ్యాప్తంగా 20 అవగాహన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బలాల, టీపీసీసీ కార్యదర్శి మక్సూద్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.